


# దొమ్మరిసాని

వంశీ

"ఈ వేళ రాత్రి దాన్ని నరికేస్తాను," అనరిచేడు సూర్యంబాబు.

"నరకడంగాదు కైమా కొట్టేస్తాను," కోపంతో వూగిపోయాడు బంగారిబాబు.

"ఏం చేసిందది?" అడిగాడు రాఘవరావు.

"అంతా తెల్సుండి కూడా అంత తీరుబడిగా అడుగుతారేంటి చిన్నాన్నగారూ. ఏంచేసిందో తెల్దా మీకు... మా అన్నయ్య ఆస్తి మొత్తం రాయించేసుకుంది... మా వోడు యాక్సిడెంటులో పోయేరంటున్నారుగానీ అదే చంపేసి నీళ్లల్లోకి తోసేసిందని నా అనుమానం," ఆవేశపడిపోతున్నాడు బంగారిబాబు.

"దానికి దాన్ని చంపితే లేనిపోని పెంట. తర్వాత బెయిలు మీదొచ్చినా ముందెల్లి జైల్లో కూర్చోవాలి... కాబట్టి దాని అంతం ఎలా చూడాలో ప్లానేశాను," అన్నాడు రాఘవరావు.

"ఏంటీ?" అంటా ముందుకి వంగాడు బంగారిబాబు.

చెప్పడం మొదలెట్టాడు రాఘవరావు.

తుంపర్లు పడ్తున్న ఆ వర్షాకాలం మధ్యాహ్నం పూట గోదావరిగాలి చల్లగా వీస్తోంది. పక్షులన్నీ తడిసిపోయి కొమ్మల్లోపల వణుకుతున్నాయి. వేటకెళ్లినవి గూళ్లకి చేరుతున్నాయి. గోదావరిలో ఒక ఆడమనిషి శవం అటుగా కొట్టుకొస్తోంది. వాళ్లు ఎక్కిన నావ ఆ శవం పక్కనించే వెళ్తోంది.

*

ఎండాకాలం వచ్చేసింది. చిటచిటలాడే ఎండ కంపరమెత్తిస్తుంది. ఒకటే ఉక్కగా వుంది. ఎక్కడా గాలాడ్డం లేదు. గోదారి నీళ్లలోంచి సెగలొస్తున్నాయి.

ఒడ్డున ఒంటరిగా వున్న ఆ జిల్లేడు మొక్క ఒంగిపోయుంది. ఎండకి ఉడికిపోతున్న ఆవులూ గేదెలూ గోదావరి నీళ్లల్లో ములిగి చెవులూగేలాగ తలలాడిస్తున్నాయి. పాపతోపాటు వాళ్ల దొమ్మరిమేళం ఎక్కిన ఆ పడవ కోరుమిల్లి రేవులో ఆగింది. పదిహేనుమంది జనం కిందకి దించుతుంటే చుట్టూ మూగిన పిల్లలు, "దొమ్మరోళ్లొచ్చేరు దొమ్మరాట కడతార్రా," అనరుస్తున్నారు.

రేవులో వున్న చీకట్ల మందయ్య, ఆకుల సాంబమూర్తి కాఫీ హోటళ్ల దగ్గర జనం వాళ్లలో దొమ్మరిసాని పాపని చూస్తున్నారు. నల్లగా అందంగా వున్న ముఖం, కాటుక పెట్టకపోయినా వెడల్పుగా వున్న కళ్లు, ముడేసినా చివర్న మిగిలిపోయి వేలాడే జుట్టు, చాలా బిగువుగా వున్న శరీరం.

చూస్తున్న జనం, 'ఇంతమంది దొమ్మరిసానుల్ని చూశాం ఇంతందగత్తె నెప్పుడూ చూళ్లేదు,' అనుకుంటున్నారు.

సామాన్లు నెత్తిమీద పెట్టుకుని వూళ్లోకి నడుచుకొస్తుంటే మెళ్లో గుదిబండ కట్టేసిన ఆంబోతు ఎదురైంది.

దాన్ని చూసి 'మంచి శకునం' అనుకున్నాడు వాళ్లలో పెద్దోడైన వెంకటేశులు.

చింతచెట్ల నీడల్లో కూర్చుని చింతపండులో ఇక్కతీస్తున్న ఆడాళ్లు పాప అందాన్నే చూస్తా మాటాడుకుంటున్నారు.

వంతెన దిగి సుంకరవారి వీధిలోంచి ఊళ్లోకి నడుస్తున్న పాపకి పంపరపనాస చెట్ల సందుల్లోంచి రాజుగారి పాతమేడ కనిపిస్తోంది.

వందేళ్ల చరిత్ర గల జనార్ధనస్వామి గుళ్లో తమ సరంజామా సర్దుకుని ఆ రాత్రి అక్కడే వండుకు తిని పడుకున్నాకా మర్నాడు రథం వీధిలో తొమ్మిది గజాల పొడుగున్న గెడ నిలబెట్టి, నేలమీద పెద్ద పెద్ద మేకులు దిగ్గొట్టి దానికి అంగుళం కైవారమున్న తాళ్లు కట్టి తాడు అవతలి చివర పొడుగైన ఆ గెడపైన కడ్తున్నారు. అలా గెడ నాలుగు మూలలా నాలుగు తాళ్లు కట్టి పైకి లేపారు. ఇంకోచోట రెండు గెడలు దూరం దూరంగా పాతేసి రెండింటికీ వంతెనలాగ ఇంకో తాడు కట్టారు.

ఆట మొదలైంది.

పైన చొక్కా లేకండా నిక్కరేసుకున్న అప్పన్న అంతసేపూ ఎండలో ఎండబెట్టిన డప్పు వాయించడం మొదలెట్టేసరికి ఇళ్లల్లో జనం బయటికొస్తున్నారు. నిన్న రేవులో పాపని చూసిన జనమయితే ఇందాకే వచ్చే శారు. ఊళ్లోంచి గోదారొడ్డుకెళ్తున్న వాళ్లు, లంకల్లోంచి ఊళ్లోకెళ్తున్న వాళ్లు దొమ్మరాట దగ్గరాగిపోయారు. ఒకటే సందడిగా వుంది. రాట చుట్టూ మూగిన వాళ్లంతా దొమ్మరాట చూడ్డం కోసం ఒకటే సరదా పడ్తున్నారు. గళ్ల లుంగీ, ఖద్దరు చొక్కా వేసుకున్న నెక్కంటి క్రిష్ణ బాబు కూడా మూగిన జనంలో వున్నాడు.

కాస్సేపయ్యింది.

కాళ్లకి ఘల్‌ఘల్‌మంటా చప్పుడొచ్చే మువ్వల పట్టాలు కట్టుకుని నల్లంచు ఎర్రకోక పిక్కల్దాకా బిగించి కట్టుకుని పెద్ద కళ్లకి కాటుకా, కుంకంబొట్టూ, పెద్ద ముడేసుకుని నడుస్తా గెడ దగ్గర కొచ్చిన పాప ముందు రెండు గెడల మధ్యున్న తాడు దగ్గర కెళ్తుంటే అప్పన్న డప్పు మోత పెరిగింది. పక్కనే జేరిన కొండగాడు విజి లెయ్యడం మొదలెట్టాడు.

నెక్కంటి క్రిష్ణబాబు ఆ దొమ్మరిసాని పాపనే చూస్తున్నాడు.

గమ్మత్తుగా దిగ్గొట్టిన రాట పైకెక్కిన పాప హుషారుగా తాడు మీద నిలబడి అడుగులో అడుగేసు కుంటా వయ్యారంగా ఈ రాట దగ్గర్నుంచి ఆ రాట దగ్గరకి నడుచుకుంటా వెళ్తుంటే చప్పట్లు కొట్టేస్తున్నా రంతా. అటుపక్క రాట దగ్గర కొచ్చేసిన దొమ్మరిపాప తలొంచి, చూస్తున్న జనాలకి దణ్ణం పెడ్తోంది.

ఆ పాపనే చూస్తున్నాడు నెక్కంటి క్రిష్ణబాబు.

పాప జుట్టులోంచి కారిన చెమట్లు చెంపల మీంచి జారిపోతున్నాయి. ఆ మండే ఎండలో ఆ ఎర్ర కంకర నేలమీద వెల్లకిలా పడుకుని కాళ్లూ చేతులూ నేలమీదానించి నడుం పైకెత్తింది పాప. పరుగెట్టు కుంటా వచ్చిన వాళ్లలో నలుగురు పిల్లలు పాప రెండు జబ్బల మీదొకడూ, వెడల్పాటి చాతీ మీదొకడూ పొత్తి కడుపు మీదొకడూ, మోకాళ్ల మీదొకడూ నిలబడ్డారు. ఈ నిలబడ్డ వాళ్ల జబ్బల మీద ఇంకో నలుగురు నిల బడ్డారు. చేతులూ కాళ్లూ ఆ మండే నేలమీద ఆనించిన పాప నవ్వుతా భరిస్తోందా బరువుని.

జనం చప్పట్లు కొడ్తుంటే క్రిష్ణబాబు మట్టుకి పాపనే చూస్తున్నాడు.

గమ్మత్తుగా పల్టీలు కొడ్తున్న పాపని రెప్పార్పకండా చూస్తున్నారు. మెరుపులు మెరిసినట్టు మొగ్గలు వేస్తుంది. ఒంటికాలి మీద గెంతుతుంది. డప్పులకి తగ్గట్టు రకరకాల డేన్సులు చేస్తుంది. తన అందమైన శరీరాన్ని రకరకాలుగా ఒంచుతా చిత్రాలూ విచిత్రాలూ చేస్తుంది. చూస్తున్న జనం ఊపిరి పీల్చడం ఆపేశారు. ఎత్తైన గెడ మధ్యలో ఉయ్యాల్లాగుంది. దాని పైకెక్కిన పాప జైంట్ వీల్లాగ ఉయ్యాల ఊగుతోంది. మళ్లీ జనం చప్పట్లు. క్రిష్ణబాబు పాపనే చూస్తున్నాడు.

డప్పు వాయిస్తున్న అప్పన్నకి ఇంకో డప్పు వాయిస్తా వచ్చిన బాపన్న, 'లాస్ట్ ఐటమ్,' అంటా అరుస్తున్నాడు.

తాచుపాము పాకినట్టు జరజరమంటా గెడ కర్ర పైకి పాకిన పాప గెడ పైనున్న ముల్లు మీద తన బొడ్డు ఆనించి దగ్గర దగ్గర పావుగంటసేపు గిరగిరా తిరిగి, మళ్లీ వెనక్కి తిరిగి బాగా అలిసిపోయి గెడకర్ర దిగు తుంటే కొణిశెట్టివారి వీధి, గొల్లపేట, సాలిపేటల్నుం చొచ్చి మూగిన జనం ఒకటే చప్పట్లు, ఈలలు, గోలలు. ఏ చప్పుడూ చెయ్యని ఆ క్రిష్ణబాబు మట్టుకి ఆ మనిషినే చూస్తున్నాడు.

అప్పన్నా, సుబ్బన్నా, బాపన్నా, వెంకటేశులూ అంతసేపూ వాయించిన డప్పులు తిరగేసి చుట్టూ మూగిన జనం దగ్గరకొస్తుంటే రూపాయీ రెండ్రూపా యలూ అయిదు రూపాయిలూ వేస్తున్నారు. రేవులో పాపని చూసిన వాళ్లు పాతిక నించి యాభైదాకా వేస్తున్నారు.

ఏమీ వెయ్యకండా వెళ్లిపోతున్న నెక్కంటి క్రిష్ణ బాబు పాప దగ్గరకొచ్చి ఆమె కళ్లల్లో కళ్లెట్టి చూశాడు.

పాప కూడా చూసిందతన్ని.

మంచులో పూసిన నందివర్ధనంలాగ నవ్వాడు.

అది చూసిన పాప, 'ఇలాంటి నవ్వు నే పుట్టాకా చూళ్లేదే,' అనుకుంది. ఆ నవ్వుని మళ్లీ చూడాలను కుంది.

ఆ రాత్రి జనార్ధనస్వామి గుళ్లో పడుకున్న పాప ఈ నవ్వుని అప్పుడప్పుడూ చూడాలనుకుంది.

*

ఆ పదిహేను మంది ట్రూపూ కోరుమిల్లిలో ఉంటా చుట్టుపక్కల ఊళ్లన్నీ తిరిగి దొమ్మరాట కడతా చీకటి పడ్డాకా గుడి అరుగుల మీద కొచ్చేస్తున్నారు.

ఆవేళ రాత్రి ఊళ్లో కరెంటు లేదు. వెన్నెల వెలిగి పోతోంది. గోదాట్లొంచొచ్చే గాలి వింత చప్పుళ్లు చేస్తా ఊరిని చుట్టుముట్టేస్తోంది. మాటుమణిగిన ఊళ్లో ఏ చప్పుడూ లేదు. ఇంకా నిద్రోకండా ఆ క్రిష్ణబాబునే తల్చు కుంటా వెల్లకిలా పడుకున్న పాప చంద్రుడ్నే చూస్తోంది.

*

మర్నాడు ఏటి గట్టెక్కిన దొమ్మరోళ్లంతా మల్ల వరం బయల్దేరుతుంటే మందయ్య కాఫీ హోటలు దగ్గర నిలబడ్డ క్రిష్ణబాబు అప్పన్న దగ్గరకొచ్చి, "ఇవ్వేళ ఏ ఊళ్లోనంట?" అన్నాడు.

"మల్లవరవండి," అన్నాడు అప్పన్న.

క్రిష్ణబాబుని ఓరగా చూస్తా వెళ్లిపోయింది పాప.

ఎప్పుడూ లేంది... ఆట గడ్తున్నప్పుడు ఆ క్రిష్ణబాబే గుర్తుకొచ్చేడు. ఒకసారిగాదు రెండుసార్లుగాదు చాలా సార్లు. మొన్నటి ఆ నవ్వే ఇవ్వాల్టి ఆ మెత్తటి పలకరింపే గుర్తుకొచ్చింది.

ఈసారి ఎదురుపడ్డప్పుడు పలకరించాలని పిస్తుంది.

మధ్యాహ్నం దాకా మల్లవరంలో ఆటగట్టి డబ్బులు దండుకుని దీపాలవేళకి ముందే తిరుగు ముఖం పట్టేరు.

గోదావరిగట్టుకి కుడిపక్కనున్న వంతెన దిగి ఊళ్లో కెళ్తుంటే మోపెడ్ బండి మీద ఎదురైన క్రిష్ణబాబు బాపన్నని పిల్చి, "దొమ్మరిసాని పొలాల్లోకి అడుగెడితే పంటలు బాగా పండుతాయంట గదా మీ మనిషిని మా పొలంలోకోసారి తీసుకురావచ్చు గదా?" అన్నాడు.

పాపకి వినిపించిందా మాట.

మర్నాడు క్రిష్ణబాబుగారి పొలంలోకి గోదారి మధ్యనున్న లంకలోకి తిరుగుతుంటే చాలా సంబరపడ్డ క్రిష్ణబాబు అయిదొందలు కొండబాబుగాడికిస్తా, 'గెడెక్కి నప్పుడు రిస్కు అయిటమ్సు చేస్తోంది. కాస్త జాగర్తని జెప్పండా మనిషికి," అన్నాడు. అదీ పాపకి వినిపిం చింది.

క్రిష్ణబాబు అన్నట్టే ఆవేళ సుందరపల్లిలో తొమ్మిది గజాల పొడుగున్న ఆ గెడెక్కి తిరిగిన పాప కిందకి దిగుతా కాలు జారిపడిపోయింది.

ఆ విషయం తెల్సిన క్రిష్ణబాబు చిన్నకారు కట్టించి కాకినాడ తీసుకెళ్లి పెద్దాస్పటల్లో జేర్చాడు.

'ఆ మనిషి ఇంక గెడెక్కి తిరగడానికిగానీ, పల్టీలు కొట్టడానిగ్గానీ ఈ జన్మకి పనికిరాదు,' అని డాక్టర్లు క్రిష్ణ బాబుతో చెపుతుంటే విన్న పాప ఆత్మహత్య చేసుకోబో యింది. వెనక్కి లాగిన క్రిష్ణబాబు, "ఈ ఆత్మహత్యలూ అయ్యా ఎందుకూ పనికిరానోళ్లు చేసుకుంటారు," అన్నాడు.

ఏడుస్తుంది పాప.

"ఇలాంటి పన్లు ఇంకెప్పుడూ చెయ్యనని ఒట్టెయ్యి," అన్నాడు.

అతని గురించి ఏమాత్రం తెలీని పాప ఎందు కేసిందో ఒట్టేసేసింది.

అప్పన్నా, బాపన్నా క్రిష్ణబాబు గురించి వాకబు జేశారు. కమ్మోళ్ల కుర్రోడంట. బాగా మోతుబరులంట. ఆమధ్యే ఏవో తేడాలొచ్చి భార్యకి విడాకులిచ్చి ఆవిడ పుట్టినూరయిన వాకతిప్ప పంపేసేడంట. మొన్న పడవ దిగి వస్తుంటే పంపరపనాస చెట్ల సందుల్లోంచి కనిపిం చిన ఆ మేడ రాజుల్ది కాదంట వీళ్లదేనంట.

వేలకి వేలు ఖర్చుపెడతా రాత్రీ పగలనక హాస్పి టలు దగ్గరే వుండి పాప బాగోగులు చూస్తున్న క్రిష్ణ బాబుని, 'ఆ దొమ్మరిసానికోసం ఏంటీ పడిగాపులూ,' అంటా తిడ్తున్నారు వాళ్ల పెద్దోళ్లు.

'ఏ ఊరెళ్తే ఆ ఊళ్లో ఒకడ్ని పట్టే ఆ ముండకేంటీ చాకిరీ?,' అంటున్నారు బంధువులు.

వాళ్లంటున్న కొద్దీ పాపమీద ఇష్టం మరింత పెరిగి పోతోంది క్రిష్ణబాబుకి.

పాపతో పాటు ఆమె చుట్టూ వున్న పద్నాలుగు మంది తిండి సంగతి కూడా క్రిష్ణబాబే చూస్తున్నాడు.

మూడు నెల్లు గడిచాయి.

మామూలు మనిషైంది పాప.

ఆ మనిషి పడుకున్న మంచం దగ్గరకొచ్చి మొట్ట మొదటిసారి నోరు విప్పిన క్రిష్ణబాబు, "నీ కిష్టమైతే మని ద్దరం పెళ్లి చేసుకుందాం?" అన్నాడు.

కొయ్యబారిపోయింది.....ఆరోజంతా అలా ఉండి పోయిన ఆ పాప ఎప్పటికో, 'ఇలాంటి మనిషిని ఇంతకు ముందెప్పుడూ ఎరగను,' అనుకుంది మనసులో.

*

కోరుమిల్లి గోదావరి ఎదురుగా ఉన్న ఏభై ఎకరాల లంకలో ఒక వాడపల్లి పెంకుటిల్లు కట్టించి ఆ ఇంట్లో పెట్టాడు పాపని. ఓ మంచిముహూర్తం చూసి కోటిపల్లి గుళ్లోకి తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు.

శుక్లపక్షమి రోజులు. రోజురోజుకీ ఎదుగుతున్నాడు చంద్రుడు. ఆ వర్షాకాలం సాయంత్రం గాలి పెద్దగా వీయకపోయినా చల్లగా వుంది వాతావరణం. లంకంతా పచ్చటి పంటల్తో కళకళ్లాడిపోతోంది. అలాగే వచ్చే నావల్తో వెళ్లే పడవల్తో నిండుగా వుంది.

ఆ సాయంత్రం లంకలో కృష్ణబాబు చుట్టూ కూర్చున్న దొమ్మరిజనంలో కొందరు ముసలాళ్ల శరీరాల నిండా రకరకాల మచ్చలు కనిపించాయి.

"ఏటియ్యి?" అనడిగాడు కృష్ణబాబు.

"ఇయ్యాండీ... ఆటగట్టినప్పుడు నొప్పులుగా వుంటే వాతలు పెట్టుకునేవాళ్లం ఆ మచ్చలియ్యి," అన్నారు.

"ఆఁ... తర్వాత?" అన్నాడు క్రిష్ణబాబు.

"శరీరం మీద గడ్డలేస్తే గుడ్డముక్కని చుట్టకింద చుట్టి అంటించి గడ్డ కట్టిన చోట కాల్చుకునేవోళ్లం... దాంతో నెమ్మదిగా పుండు పడి సీమూ రసీ కూడా బయటికొచ్చేసేయి. ఈటిలో ఆ మచ్చలు కూడా వున్నాయండి," అన్నాడు బాపన్న.

"వాపు వస్తే ఇటుక పొడుం కాల్చుకుని వేసుకునే వాళ్లం. దెబ్బలు తగిలితే పసర్లు పూసుకునేవాళ్లం... తర్వాత ఇంగ్లీషు మందులు రావడం ఇప్పుడు డాక్టర్ల దగ్గర కెళ్లడం జరుగుతుందనుకోండి," అన్నాడు వెంకటేశులు.

"ఎంత వెళ్లినా మా పాపని మీరు తీసుకెళ్లినంత గొప్ప డాక్టరు దగ్గరకి మేవెప్పుడు వెళ్లలేదండి," అని చేతులెత్తాడు అప్పన్న.

దొమ్మరిమేళంలో వాళ్లందరికీ, "ఇంక పాప దొమ్మరాటలు కట్టకూడదని చెప్పాడు డాక్టరు. మీరు మా లంకలో ఉండి వ్యవసాయం పన్లుచేస్తారా, బయటికెళ్లి ఇంకేవన్నా చేసుకుంటారా?" అన్నాడు క్రిష్ణబాబు.

"నాలుగూళ్లు తిరిగిన కాళ్లు మావి... ఇలాగ గోదావరి మధ్య లంకలో ఎక్కువ రోజులుండ లేవండి. తమరేవన్నా రొక్కం ఇప్పిస్తే, వెదురుబుట్టలూ, చాపలూ, తడికలూ, గిలగిచ్చకాయలూ అల్లుకుని బతుకుతాం, లేదంటే ఏదన్నా చిన్నపాటి వ్యాపారం చేసుకుంటావండి," అన్నాడు సూర్రావు.

"లాభాలొచ్చేలాగ చూసుకోండి," అంటా ఆ పద్నాలుగుమందికీ ఒక లక్ష రూపాయిలిచ్చి పంపిన క్రిష్ణబాబు పాప దగ్గరకొచ్చి, "నీకీ లంకలో వుండటం ఇష్టమేనా బయటికెళ్దామా?... నువ్వసలు మొహమాటపడకూడదు. నీ మనసులో ఏముంటే అది నాకు చెప్పెయ్యాలి. నాక్కావల్సింది నువ్వు సుఖంగా ఉండటం. నువ్వు పిసరంత నొచ్చుకుంటే నేను గిలగిల్లాడిపోతాను. అబద్ధమాడ్డవంటే చాలా అసహ్యం నాకు. కడుపులో ఉన్నది ఉన్నట్టు చెప్పు," అన్నాడు.

అతన్ని గుండెలకద్దేసుకుని పెద్దగా ఏడ్చేసింది పాప.

వాళ్ల కాపరం మొదలైంది.

పొద్దుటే లేచిపోయే అలవాటున్న క్రిష్ణబాబు ఇంకా నిద్రపోతున్న పాపని చూసి తన చప్పుడికి ఎక్కడ లేచిపోద్దో మనిషి అనుకుంటా నెమ్మదిగా లేచి పొయ్యి దగ్గరకెళ్లి వెలుబూడిద కచ్చికా, తాటాకూ, చెంబుడు నీళ్లు పట్టుకొచ్చి లేచాకా పళ్లు తోముకోడానికి మంచం దగ్గరపెట్టి, టీ కాచి ఓ గ్లాసుడు తాగి ఇంకో గ్లాసుడు పాప కోసం స్టీలు దాకలో వుంచి లంకలోకి బయల్దేరేవాడు.

మధ్యాన్నం ఇంటికొచ్చేటప్పటికి పాపగానీ నిద్రోతుంటే తన చప్పుడికా మనిషి ఎక్కడ లేచిపోద్దో అని భయపడ్తా లంక అంచునున్న గోదాట్లో కెళ్తుంటే అతన్నే చూసేది పాప.

స్నానం చేసొచ్చి పాప వండిన వంటలు బాగోకపోయినా చాలా బాగున్నాయని మెచ్చుకునేవాడు.

ఆ పండు వెన్నెలరాత్రి గోదావరి మధ్య ఆ లంకలో పర్ణశాలలాంటి ఆ తాటాకింటి ముందు ఆకివీడు నవారు మంచం మీదేసిన బూరుగుదూది పరుపు పైన ఒత్తిగిల్లి పడుకున్న పాప పక్కనే జేరిన క్రిష్ణబాబు వేపు తిరిగిన పాప, "మిమ్మల్నోటడగనాండీ?" అంది.

"ఏంటి ?"అన్నాడు.

"డబ్బున్నోరు... కులానికి గొప్పోరు... మీరు కోరుకుంటే గొప్ప గొప్పోళ్లొస్తారు మీ కాళ్ల దగ్గరకి... దొమ్మరిసాన్ని నన్నెందుకు పెళ్లాడేరు?" అంది.

ఎప్పుడూ పొడిపొడిగా మాటాడే పాప ఇలా మాటాడ్తుంటే కాస్త ఆశ్చర్యంగా చూసిన క్రిష్ణబాబు, "మొదట్నుంచీ ఇంతే. నేను చాలా నెమ్మదస్తుడ్ని... పోతే నీ వంశం కులం నాకొద్దు... అదో గొప్పరోజనుకుంటాను. గొప్ప ముహూర్తం అనుకుంటాను. ఆరోజు... నిన్ను చూశాను... నిన్ను ఇష్టపడ్డాను... నీ ఇష్టం మీద పెళ్లి చేసుకున్నాను. హాయిగా కాపరం చేస్తున్నాం... ఆనందంగా వుంది," అన్నాడు.

చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్న తనకి చాలా ప్రశ్నలకి సమాధానాలు దొరికిన ఆనందంతో ఆ భర్తని కౌగిలించుకుని ఆదమరిచి నిద్రోయింది పాప.

అప్పుడప్పుడూ కోటిపల్లెల్లి చిన్న బ్రాందీ సీసా తెచ్చుకుని కొంచెం కొంచెంగా దాన్ని నాలుగురోజులు తాగేప్పుడు పాపకి ఆ వాసనెక్కడ పడదో అని ఆ పక్కకి తిరిగి పడుకునేవాడు నెక్కంటి క్రిష్ణబాబు.

*

పెద్దగా వర్షాలు కురవని ఆ వర్షాకాలమెళ్లి పోయాకా చలితో గడగడలాడించే శీతాకాల మొచ్చింది. ఈ చుట్టూ గోదారి నీళ్ల మధ్య లంకలో చలికి పాప ఎక్కడ వణికిపోతుందో అని పనిగట్టుకుని ద్వారపూడి బట్టల సంతకెళ్లి నాలుగు షోలాపూరు దుప్పట్లూ రెండు హర్యానా రగ్గులూ కొనుక్కొచ్చాడు.

చలికాలమెళ్లిపోయాకా ఎండాకాలమొచ్చింది. రోహిణీకార్తి ఎండకి ఉడికిపోతున్న గొర్రెలూ మేకలూ ఆ చిన్న తుమ్మచెట్టు నీడలోనే సర్దుకు పడుకున్నాయి. కోసేసిన పంట పొలాల్లో ఒత్తుగా పెరుగుతోంది మినప చేను. మూడడుగులు మాత్రం పెరిగిన ఆ చిన్ని తాడి చెట్టు మొదలు నరికి మొవ్వుని తీస్తున్నాడా పాలికాపు. ఓ గూటిపడవ లంక ఒడ్డుకొచ్చి ఆగింది. దాంట్లోంచి దిగిన షావుకారు యర్రమిల్లి భద్రం నెక్కంటి క్రిష్ణబాబు ఇంటి దగ్గరకొచ్చి పొలికేకలేస్తా పాపని పిల్చి, "ఊళ్లో బాకీలున్నాయని జెప్పి నా దగ్గర పదివేలు తీసుకునొచ్చి ఏంటీ దుకాణం ఇక్కడెవరన్నా కుర్రోడు తగిలాడా," అంటా అరుస్తున్నాడు.

నోటమాట లేని పాప నిలబడుండిపోయిందలా.

"నాకోసం పడున్నానంటే నీకెంత జేశానే... నిజంగా సానివనిపించుకున్నావు గదా నా డబ్బులిస్తావా నాతో పాటొస్తావా?" అంటా ఇష్టానికి పేల్తున్నాడా షావుకారు భద్రం.

చాలా పెద్ద గొడవయ్యింది.

నెమ్మదిగా షావుకారు భద్రం దగ్గరకొచ్చి అతనిచ్చిన డబ్బు వడ్డీతో సహా ఇచ్చేసి మర్యాదగా అతన్ని పడవెక్కించి పంపేసి వెనక్కి తిరిగాడు క్రిష్ణబాబు.

ఆవు పేడతో అలికి సున్నం ముగ్గులెట్టిన ఇంటి అరుగుమీద కూర్చున్న పాప దగ్గరకొచ్చి నిలబడ్డ క్రిష్ణబాబు, "అదంతా మనం కలవడానికి ముందు నువ్వు చేసింది. కాబట్టి నేను తప్పుపట్టను. మనం తీర్చడానికి ఇలాంటి బాకీలింకా ఏవన్నా వున్నాయా?" అన్నాడు.

ఏ సమాధానం చెప్పకండా అతని పాదాలమీద పడి దొర్లిదొర్లి ఏడ్చింది పాప.

"ఎంతో అవసరం వుంటే తప్ప అబద్ధం ఆడను నేను. నువ్వూ నాలాగే వుంటే బాగుంటది," అన్నాడు క్రిష్ణబాబు.

ఆ తర్వాత చాలా అడిగాడు క్రిష్ణబాబు. ఎక్కడా దాయకండా అన్నింటికీ పచ్చి నిజాలే చెప్పింది.

విని వూరుకున్నాడు తప్ప ఏం మాటాడలేదు.

*

వర్షాకాలం వచ్చింది.

నిన్న పొద్దుట్నుంచి పట్టుకుంది ముసురు. చల్ది పొద్దు దాటిన వెంటనే మొదలైన వర్షం ఇంకాగలేదు. కురుస్తానే వుంది. సాయంత్రానికి తెల్సింది.

తుఫాను.

చప్పటి వరదనీరు లుబ్బలుబ్బలుగా కొట్టుకొస్తోంది. తెల్లవారింది. నీటిమట్టం పెరిగింది. పెద్దపెద్ద చెట్లు పొదలు కొట్టుకొస్తున్నాయి. వాటిల్లో ఒక ఆవు కళేబరం కూడా ఉంది.

పొద్దుట మొదలైన వర్షం కురుస్తానే ఉంది. మనుషుల్ని కూడా చాలా గట్టిగా పడగొట్టేస్తోంది గాలి.

రాత్రయ్యింది.

ఎక్కడా ఆగడం లేదు వర్షం. జల్లు ఇంట్లోక్కొడ్తోంది.

క్రిష్ణబాబుని దగ్గరకి పిల్చిన పాప, "కాస్త పులపరంగా వున్నట్టుందండీ," అంది.

ఆ మనిషి నెవరగంత మీద చెయ్యేసి చూసి, "అట్లపెణంలా కాలిపోతుంటే పులపరం అంటావేంటి... ఇందాకట్నుంచీ ఎందుకు చెప్పలేదూ?" అన్నాడు.

"సందకాడ బానే వుందండి," అంది.

తలుపు తీసి బయటికి చూశాడు. ఒకటే వర్షం, గాలి, కటిక చీకటి. ఏది నీరో ఏది నేలో తెలీడం లేదు. ఆ తుఫాన్లో బయల్దేరుతుంటే అతని చేతులు పట్టుకుని వెనక్కి లాగిన పాప, "బయటికెళ్లొద్దండి," అనరిచింది.

"డాక్టర్ని తీసుకురావాలి," అంటా పాపని విడిపించుకునెళ్లిన క్రిష్ణబాబు తడిసి ముద్దవుతా నీళ్లు నిండిన పైరు చేలు దోసపాదుల్ని తొక్కుకుంటా లంక ఒడ్డున కట్టిన నావఁ దగ్గర కొచ్చేడు. దిగేసిన ఊచకి కట్టిన తాడు తీసి నావలో కూర్చుని తెడ్డేస్తున్నాడు.

భోరుమంటా కురుస్తున్న ఆ గాలివానలో నావ ముందుకెళ్తుందిగానీ తను తెడ్డేసే వేపెళ్లడం లేదు.

దానిష్టానికదెళ్తోంది. దాని మానాన అదెళ్తోంది. గాలివాటం మారినప్పుడు గిరగిరా తిరిగిపోతోంది.

ఎంత కష్టపడ్తున్నా ఆ నావఁ తన మాట వినడం లేదు. అలా దిగువకి కోటిపల్లి వేపుకి కొట్టుకుపోతోంది. ఆవేశం పెరిగిపోయిన క్రిష్ణబాబు తెడ్డు వేస్తానే ఉన్నాడు. నావఁలో ఆ చివర్నించి ఈ చివరికి అంగలేసుకుంటా

నడవడం వల్ల ఒక్కసారిగా బోల్తాపడింది నావఁ. నావతో పాటు క్రిష్ణబాబు కూడా ములిగిపోయాడు.

చేతిలో తెడ్డు వదిలేసి తన జబ్బ సత్తువకొద్దీ ఈదుతున్న అతనికి ఆ చీకట్లో తనెక్కడున్నాడో అర్థం కావటం లేదు. ఓ పక్కనించి హోరుగాలి వాన. ఏ వేపుకి ఈదుతున్నాడో అసలర్థం కావడంలేదు.

అలా ఈది ఈది గస పెరిగి జబ్బలు పడిపోడంతో ఇక ఈదడం ఆపేసిన క్రిష్ణబాబు వరదనీళ్లలోకి ములిగిపోతున్నాడు. గిలగిలా కొట్టుకుంటా నీళ్లు తాగేస్తున్నాడు. అడుక్కి కూరుకుపోతున్నాడు.

అలా లోపలికి అట్టడుక్కి దిగడిపోయిన క్రిష్ణ బాబు మరింక తేలలేదు.

*

తెల్లవారాక కోటిపల్లి దాటేకా ఎక్కడో యానాం దగ్గర్లో ఉన్న పిల్లంకరేవులో పడిపోయున్న ఒక నిద్ర గన్నేరు చెట్టు కొమ్మల్లోపల ఇరుక్కుపోయుంది నెక్కంటి క్రిష్ణబాబు శవం.

శవాన్ని పండించే పన్లూ అవీ పూర్తయ్యాయి.

ఆ మిట్టమధ్యాన్నం గోదాట్లో ఎండ మిటమిట లాడిపోతుంది. చెట్లన్నీ కదలకండా ఆగిపోయినియ్యి. గాలి ఎక్కడా లేదు. గోదావరిలోంచి లంక వేపెళ్తున్న ఆ రెండు పడవలనిండా జనం. ఒక పడవలో క్రిష్ణబాబు తమ్ముళ్లు బంగారిబాబూ సూర్యంబాబూ, చిన్నాన్న రాఘవరావూ ఇంకా మేనమావలూ బులిబాబూ పెద బాబూ బిడ్డలు వున్నారు. వెనకాలొస్తున్న పడవలో గునపాలూ గెడకర్రలూ పట్టుకున్న మెలి తిరిగిన కండల్తో వెట్టివాళ్లున్నారు.

కాస్సేపయ్యింది.

రెండు పడవలూ లంక ఒడ్డునాగాయి.

వాటిలోంచి దిగిన జనం దొమ్మరిపాపకి నెక్కంటి క్రిష్ణబాబు కట్టించిన ఇంట్లో కొచ్చారు.

చీకట్లో పడుకున్న పాప చుట్టూ మూగారు.

వాళ్లొచ్చినట్టు తెల్సి కూడా తలెత్తని పాప మీదకి ఒంగిన, నెక్కంటి క్రిష్ణబాబుకి స్వయానా చిన్నాన్న అయిన నెక్కంటి రాఘవరావు, “స్టాంపు పేపర్లు తెచ్చేం వాటి మీద వేలిముద్రలెయ్యి... బస్సు చార్జీలిస్తాం బట్టలు సర్దుకుని చీకటి పడేలోపు ఈ గోదారిగట్టు దాటి వెళ్లిపో... మేం చెప్పినట్టు చేస్తే ఏదోచోట సుఖపడతావ్... కాదూ అని ఎదురుతిరిగితే... అదిగో పడవ నిండా తీసుకొచ్చిన ఈ వెట్టివాళ్లని చూడు, ఈ రాక్షసుల్ని చూడు. మొత్తం ఇరవై మందున్నారు. మా బంగారిబాబుగాడు చాలా స్పీడు. నిన్న సాయంత్రం నిన్ను చంపేద్దామని ఊగిపోతే నేనే ఆపేను. ఆలోచించుకో,” అనేలోపే వాళ్ల స్టాంప్ పేపర్ల మీద వేలిముద్రలేసి బయటికెళ్లిపోయింది పాప.

యానాం రేవు దాకా నడుచుకుంటా వచ్చింది.

ఆ రేవులో మనిషి దూకితే ఇక బయటికి తేలడ వంటూ వుండదు అంత లోతు.

చచ్చిపోదామని దూకబోయిన పాపకి క్రిష్ణబాబు గారు గుర్తుకొచ్చేడు. ఆ మనిషి ఆత్మహత్య చేసుకోనని ఒట్టేయించుకున్న విషయం గుర్తొచ్చింది.

‘బతికే సాధించాలి పాపా,’ అన్న ఆ మనిషి మాటలు వెనక్కి లాగాయి తనని.

కొత్త బస్టాండు దాకా నడిచి కాకినాడ బస్సెక్కింది.

*

సామర్లకోట వెళ్లే సిటీబస్సు కాకినాడ బాలా చెరువు దగ్గరాగుంది. పొద్దుట్నుంచీ కలక్షను తీసుకోవడానికి లాస్ట్ ట్రిప్పులో దాని ఓనరు సలాది సత్యానందం ఎక్కుతాడు.

అలా ఎక్కిన సత్యానందం ఎలక్ట్రిక్ పోల్ దగ్గర నిలబడున్న పాపని చూసీ చూడ్డంతోటే కండక్టరు సాయి రాజుగాడ్ని పంపించి ఆ మనిషితో మాటాడించి బస్సెక్కేలా చేసేడు.

రైళ్లన్నీ వెళ్లిపోడం వల్ల సామర్లకోట స్టేషను ఖాళీగా ఉంది. వర్షాకాలం అవడం వల్ల ఆకాశంలో మబ్బులు బాగా మూసున్నాయి. గాలి హాయిగా వీస్తోందిగానీ వర్షం మట్టుకి రావడం లేదు. బాగా రాత్రవడం వల్ల జనం ఎవరూ లేరు. స్టేషన్లోకి తీసుకెళ్లి నాలుగో నెంబరు ప్లాట్‌ఫారం చివరికి సిమ్మెంటు బెంచీ మీద కూర్చోబెట్టాడు.

“చెప్పు ఎవర్నువ్వు? ఏంటి నీ కత?” అన్నాడు సత్యానందం.

“నా కత చెప్పే బలం నాకు లేదు. నా పేరు పాప... మా ఆయన నెక్కంటి క్రిష్ణబాబుగారు మొన్న గోదావరి వరదలకి నావఁ ములిగి చనిపోయారు. ఆయన తాలూకోళ్లు నన్ను బయటికి గెంటేసేరు. దాంతో ఏ దూరపూరో వెళ్లిపోయి ఏ కూలిపనో చేసుకుందామనుకుంటన్నాను,” అంది పాప.

ఆ మనిషి తీరులోనూ మాటలోనూ ఏదీ దాచి చెపుతున్నట్టనిపించలేదు సత్యానందానికి. అంతా నిజవేఁ చెబుతున్నట్టనిపించింది. ‘ఈ రాత్రి తనొదిలేస్తే ఎటు పోద్దో ఈ మనిషి. పెద్దాపురం పది కిలోమీటర్లు.

ఇంత అందమైన ఈ మనిషి ఏ బ్రోకరుగాడి కళ్లలోనో పడితే ఆడు పెద్దాపురం మసీదు సెంటర్‌లోకో కాకినాడ మధురం విమానం మేడలోకో తీసుకుపోతే...' ఇలా ఆలోచించిన సత్యానందం, "నాతో పాటుంటానంటే నీ భర్త కంటే గొప్పగా చూసుకుంటాను ఆలోచించుకో," అంటా చాలా ప్రేమగా చాలా గొప్పగా మాటాడాడు.

"ఆయన చోటులోకి ఇంకెవర్నీ రానివ్వను. వద్దు గాక వద్దు," అంటా అరిచింది పాప.

అదిరిపడ్డాడు సత్యానందం. చాలా లౌక్యుడయిన సత్యానందం, "నువ్వెన్ని చెప్పు ఇంత బతుకు బతికిన నువ్వు కూలిపని కెళ్తానంటే చచ్చినా ఒప్పుకోను," అన్నాడు.

ఎవరీ మనిషన్నట్టు చూసింది పాప.

"దేవుడు చాలా చిత్రమైనోడు... మీ ఆయనగారి ప్లేసులోకి నన్ను పంపించేడేమో అనిపిస్తుంది," అన్నాడు.

మాటాడకండా చూస్తుంది పాప.

దాంతో మరింత రెచ్చిపోవడం మొదలెట్టాడు. ఎలాంటి ఆడదైనా ఇట్టే పడిపోయే మాటలు, ఎలాంటి రాయి అయినా అమాంతంగా కరిగిపోయే మాటలు. అలా చాలాసేపు మాటాడి ఆగి ఏవంటావన్నట్టు చూశాడు.

పాప ఆలోచించడం మొదలెట్టింది. వర్షం కురవడం మొదలెట్టింది. సత్యానందం మాటల్లో చనిపోయిన క్రిష్ణబాబు కనిపించాడు. నిజంగా వెళ్లిపోయిన ఆయనే ఈ మనిషిని పంపించాడా అనిపించింది. వర్షం ఆగేదాకా ఆలోచించిన పాప తడవకండా షెడ్డు కింద నిలబడ్డ సత్యానందంతో, "అలాగే," అంది.

సామర్లకోట నీలంచెరువు గట్టు వీధిలో ఒక డాబా ఇల్లు అద్దెకి తీసుకుని అందులో పాపని పెట్టిన సత్యానందం ప్రతి రోజూ సిటీ బస్సు లాస్ట్‌ట్రిప్‌లో సామర్లకోటలో దిగిపోయి పాపతో కాపురం పెట్టిన ఇంటికొస్తున్నాడు.

వారాలూ నెలలూ గడుస్తున్నాయి.

నీ భర్తకంటే చాలా గొప్పగా చూసుకుంటాను అన్న సత్యానందం ప్రవర్తనలో ఎక్కడన్నా ఆ నెక్కంటి క్రిష్ణబాబుగారి లక్షణాలు కనబడతాయా అని చూస్తుంది.

కానీ, అతను అతనే. ఈ సత్యానందం... సత్యానందమే... మనిషి వేరు... మాటలు వేరు.

కొన్నాళ్లు గడిచాకా సలాది సత్యానందంలో చాలా లక్షణాలు బయటపడ్డాయి.

రాజానగరం నించి దోసకాయలపల్లి వెళ్లే రూట్లో వున్న నందరాడ నించొచ్చిన శీలంశెట్టి సత్తిబాబు అనే మనిషి సామర్లకోట వీర్రాజు టాకీసులో సత్యానందంతో పాటు సెకెండ్ షో చూస్తున్న తనని ఇంటర్వెల్లో చూసి, "పాపా?" అన్నాడు.

"ఎలాగున్నారు సత్తిబాబుగారూ?" అంది పాప.

"బాగున్నాన్లేగానీ ఆర్టోసు కూల్డ్రింకు ఇప్పించనా. అవునూ ఈ కొత్తాయనెవరూ?" అన్నాడు.

వాళ్లమధ్యలో వుండి అంతా చూసిన సత్యానందం ఇంటికెళ్లాకా, "ఆడెవడు?" అన్నాడు.

నెక్కంటి క్రిష్ణబాబు దగ్గర నిజాలే చెప్పడాని కలవాటుపడ్డ పాప ఆ సత్తిబాబెవరో చెప్పింది.

అదిరిపోయిన సత్యానందం, "అసలు నువ్వెవరు?" అన్నాడు.

క్రిష్ణబాబు చేతిలో చెయ్యేసిన ఆ పాప తనెవరో తన స్టోరీ ఏంటో చెప్పేసింది.

పెద్దగా అరుస్తా ఆ ఎర్రగచ్చు నేలమీద పడిపోయిన సత్యానందం, "నీ భర్త పేరు నెక్కంటి క్రిష్ణబాబంటే నువ్వు కమ్మోరి కోడలివనుకున్నాను. ఎంత మోసం చేశావే దొమ్మరిసానీ... ఇదిగో అర్జంటుగా డెసిషను తీసుకున్నాను. ఇంటద్దె నెలాఖరు దాకా కట్టేసేను. వచ్చేనెల కూడా నువ్వుండాలనుకుంటే నువ్వు కట్టుకో," అనేసి పెద్దగా అరుస్తా వెళ్లిపోయేడు.

*

ఆ రాత్రికి రాత్రే బట్టలు సర్దుకుని ఆ ఇంట్లోంచి బయటికొచ్చేసిన పాప స్టేషన్లో బండెక్కింది.

పాసింజరు బండి అన్నవరం స్టేషన్లో ఆగింది.

ఒక ఆటో మాటాడెక్కిన పాప గోపాలపట్నం దాటి అన్నవరం వెళ్లింది. కొండెక్కి గర్భగుళ్లో దేవుడికి, 'మా క్రిష్ణబాబుగారికి ఆత్మశాంతి కలగజెయ్యి సత్యన్నారాయణ స్వామీ,' అని దణ్ణమెట్టుకుని ప్రసాదం పొట్లం కొనుక్కుని కొండ కింద రోడ్డు అంచున కడియం నాగబాబుగారి ఖర్జూరం, సెనగలు, మరమరాలు బఠాణీల కొట్టూ, దాని పక్కనే రంగస్వామివారి ఫొటోలూ గాజులూ అమ్మే నామారపు అప్పారావు దుకాణం, దాని పక్కనే కొండమీది కెళ్లే ఘాట్‌రోడ్డూ ఆరోడ్డు కవతల సత్యన్నారాయణమ్మ కొబ్బరి కాయలూ, అరిటిపళ్లు, పూలూ, అగరొత్తుల దుకాణం వున్నాయి. ఆ దుకాణం అవతలున్న ఖాళీస్థలంలో మర్నాడు తెల్లవారురుఝాము నించీ చల్లట్లు, పొయ్యి వెలిగించింది పాప.

ప్రతిరోజూ తలస్నానం చేసి తన క్రిష్ణబాబుగారి ఆత్మకి శాంతి కలగజెయ్యమని ఆ కొండమీది సత్యదేవుడికి దణ్ణం పెట్టుకుని పొయ్యి వెలిగిస్తున్న పాప చల్లట్ల వ్యాపారం బానే సాగుతుంది.

గాజులూ రోల్డుగోల్డు సామాన్లు అమ్మే రామచంద్రుడు షాపవతలుంది శ్రీను మోటారు సైకిళ్ల రిపేరు షెడ్డు.

ఒక చక్కని స్నేహితుల్లా పరిచయమయిన శ్రీనూ, "చూస్తున్నావు గదా ఇక్కడ... నీకు ఎవరో ఒక మగతోడు లేకపోతే చాలా కష్టం," అన్నాడు.

నిజమే అక్కడి వాతావరణం అలాగే వుంది.

"ఆ మగాడు నేనే కాదు ఎవడో ఒకడు... నేనన్నది కరక్టోగాదో చూస్తావు గదా?" అన్నాడు.

శ్రీనూ అన్నది కరక్టే. ఇక్కడి మనుషులు రాబందుల్లాగ అనిపిస్తున్నారు.

జవ్వాది చిన సుబ్బారావు అనేవాడు పెట్టే బాధలు బాగా ఎక్కువైన పాప, 'శ్రీను నా మనిషి,' అని చెప్పుకోవాల్సొచ్చిందో రాత్రి.

అది తెల్సిన శ్రీనూ, 'నిజవా?' అంటా వచ్చేశాడు దగ్గరకి.

*

మెకానిక్ శ్రీనుతో కాపరం. రోజులు గడుస్తున్నాయి. శ్రీనూది ఒక చిత్రమైన తత్వం. మూడీ మనిషి. కోపం వస్తే చేతిలో ఏముంటే అది విసిరేస్తాడు. కాస్సేపటికే తగ్గిపోతాడు. ఆ వారంలో మూడుసార్లు చెయ్యిజేసుకున్నాడు పాపమీద. అతనిలో నెక్కంటి క్రిష్ణబాబుని చూసుకునే ప్రయత్నం చేసిందిగానీ కుదర్లేదు.

ఇంకా ముందు ముందు రోజులు ఎలాగుండేవో తెలీదుగానీ, సాయంత్రం రిపేరు జేసిన స్ప్లెండర్ ట్రైల్‌కని హైవేలో నడుపుకుంటా వెళ్లిన శ్రీను, కత్తిపూడి జంక్షన్ దగ్గర లారీ గుద్దేసేసరికి స్పాట్‌లోనే తల పగిలి చచ్చిపోయాడు.

*

మళ్లీ ఒంటరిదైపోయిన ఆ పాప ఎక్కడోచోట ఏ కాయకష్టమో చేసుకు బతుకుదామంటే కుదర్లేదు. ఏ మగాడూ తనని బతకనియ్యలేదు. ఆఖరికి అనాధాశ్రమంలో చేరినా ఇంతే. అందుక్కారణం తన అందమేమో, మగాడ్ని రెచ్చగొట్టే తన ముఖం, తన శరీరమేమో!

ఆ పాప జీవితంలోకి చాలామంది మగాళ్లొచ్చేరు.

వచ్చిన కొత్తలో ఈ మనిషికీ మా క్రిష్ణబాబుగారికీ చాలా దగ్గర పోలికలున్నాయని ఆశపడేదిగానీ... పోను పోను వాళ్ల అసలు రూపాలు బయట పడిపోయేవి.

చల్లని శీతాకాలం మధ్యాహ్నం లాంటి, వెచ్చని వేసవికాలం వెన్నెలలాంటి, జిల్లుమనే వర్షాకాలం తెల్లవారుఝాము వానలాంటి, ఆ నెక్కంటి క్రిష్ణబాబుగారిలాంటి మనిషినెక్కడా చూళ్లేదు. కనీసం ఆయన జాడ, నీడ ఏ మనిషిలోనూ కనిపించలేదు.

*స్వాతి సచిత్రవారపత్రిక, 13 నవంబర్ 2009*

